
ఆంధ్రజ్యోతి

** గరిష్ఠం 30.0 | కనిష్ఠం 21.0

ANDHRAJYOTHY



సూర్యాపేట

5 | శుక్రవారం 23 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.10 (309.3558)	42,898	47,600
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.69 (4.12)	2,562.74	2331.14
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.57 (45.10)	19,374	33,606

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

ప్రాజెక్టులో నీరు.. కాల్వల్లో పారవు

- అధ్వానంగా సాగర్ ఎడమ కాల్వలు
- మేజర్లతో పాటు మైనర్ కాల్వల్లోనూ పరిస్థితి అగమ్యగోచరం
- పిచ్చిమొక్కలతో పాటు శిథిలమైన కాల్వలు
- సాగర్‌లో నీరున్నా చివరి ఆయకట్టుకు అందని పరిస్థితి
- కాల్వలను పునరుద్ధరించాలని రైతుల డిమాండ్



తిరుమలగిరి(సాగర్) మండలం రాజావరం చెరువు నింపేందుకు ఏర్పాటు చేసిన చిన్న తూము

చివరి ఆయకట్టుకు నీరందించాల్సిన కాల్వలు అధ్వానంగా మారాయి. కాల్వలు చెట్లు, రాళ్లతో పేరుకపోయి ఉండడంతో నీరు కిందకు రాలేని పరిస్థితి ఉంది. చివరి ఆయకట్టు రైతాంగానికి నీరందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో నీరు రాకపోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదల చేసి 20 రోజులవుతున్నా కాల్వలు సక్రమంగా లేకపోవడంతో ఆయకట్టు చివరి భూములకు అందడం లేదు. కాల్వల్లో ఉన్న కంపచెట్లను తొలగించకపోవడంతో నీరు దిగువకు రావడం లేదని, వరద కాల్వపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 7



సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని కాల్వల పరిస్థితికి అద్దంపడుతోంది నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని వరదకాల్వ. పూర్తిగా కాల్వ ధ్వంసం కావడంతో పాటు ఉన్న కట్టలపై కూడా పెరిగిన చెట్లు, చెత్తాచెదారంతో కాల్వ ఉన్నట్లుగా కనిపించని పరిస్థితి నెలకొంది.

రాళ్లు, చెప్పులు విసురుకొని..

- తిరుమలగిరిలో ఉద్రిక్తత దారితీసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ కార్యక్రమాలు
- బీఆర్ఎస్ శిబిరంపై కాంగ్రెస్ నాయకుల దాడి
- బీఆర్ఎస్ ప్రతిదాడితో ఉద్రిక్తత





బీఆర్ఎస్ శిబిరంపైకి దాడికి యత్నిస్తున్న కాంగ్రెస్ నాయకులు, అడ్డుకుంటున్న పోలీసులు

తిరుమలగిరి / మోత్కూరు, ఆగస్టు 22 : తిరుమలగిరి పట్టణంలో గురువారం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పోటాపోటీ కార్యక్రమాలు ఉద్రిక్తతకు దారితీశాయి. అందరికీ రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ చేపట్టిన దీక్షాశిబిరంపై కాంగ్రెస్ నాయకుల దాడి, ఆ తర్వాత బీఆర్ఎస్ నాయకులు ప్రతిదాడితో ఒక్కసారిగా ఉద్రిక్త నెలకొంది. ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఇరువర్గాల దాడుల్లో బీఆర్ఎస్ నాయకులు ఐదుగురు, కాంగ్రెస్ నాయకులు ముగ్గురు గాయపడ్డారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో తుంగతుర్తి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలను, రుణమాఫీ కాని రైతులను సమీకరించి తిరుమలగిరి మండలకేంద్రంలోని చౌరస్తాలో టెంటువేసి నిరసన దీక్ష చేపట్టారు. అదేచోట, అదేసమయంలో రైతులకు రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేపట్టారు. బీఆర్ఎస్ నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ మాట్లాడుతుండగా బీఆర్ఎస్, మాజీ ఎమ్మెల్యే కిషోర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్, సీఎం రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ ప్రతినినాదాలు చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ కార్యకర్తలపై కోడిగుడ్లు, బాణసంచాకు సంబంధించిన ఉల్లిగడ్డ బాంబులు, రాళ్లు విసిరారు. బీఆర్ఎస్ కార్యకర్తల వద్ద ఏమీ లేకపోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలపై చెప్పులు విసిరారు. చిలికిచిలికి గాలివానగా మారి ఇరువర్గాలు పరస్పర దాడి చేసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ కార్యకర్తల రాళ్ల దాడిలో అర్వపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. బీఆర్ఎస్ దీక్షా శిబిరం టెంటు కూలింది. పరిస్థితి దాటడంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. కాంగ్రెస్ నాయకుల దాడిలో తాటిపాముల, బండరామారం గ్రామానికి చెందిన పెరుమాళ్ల రాజేష్, పొదిల అంజయ్య గాయపడ్డారు. వారిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్స అందించారు. అదేవిధంగా ముగ్గురు కాంగ్రెస్‌కార్యకర్తలు స్వల్పంగా గాయపడ్డారు. బీఆర్ఎస్ దీక్షకు, కాంగ్రెస్ కార్యక్రమానికి తాము ఎలాంటి అనుమతి ఇవ్వలేదని ఎస్ఐ వీ.సురేష్ తెలిపారు. తమపై దాడి చేశారంటే, తమపైనే దాడి చేశారంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల నుంచి ఫిర్యాదులు అందాయని, ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తున్నామని తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నాయకుడు

జగదీ‌ష్‌రెడ్డిని అడ్డుకున్న పోలీసులు

తిరుమలగిరికి బయలుదేరిన సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని అర్వపల్లి మండలం తిమ్మాపురం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఆయన గాయపడ్డ కార్యకర్తలను పరామర్శిస్తానని, తన వల్ల శాంతి భద్రతలకు ఆటంకం ఉండదని, తనను వెళ్లనీయకుంటే పరిస్థితి మరోలా ఉంటుందని హెచ్చరించారు. ఆ తర్వాత పోలీసులు ఆయన్ను తిరుమలగిరికి వెళ్లేందుకు అనుమతించడంతో తిరుమలగిరి చేరుకుని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే కిషోర్‌తో కలిసి కార్యకర్తలను పరామర్శించారు.

రేవంత్ డైరెక్షన్‌లోనే దాడి: జగదీష్ రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లోనే బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి జరిగిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మోసాలు బయటపడకుండా ఉండేందుకే హింసను ప్రేరేపిస్తున్నారన్నారు. పోలీసుల సమక్షంలోనే శిబిరాన్ని కూల్చివేశారని, కాంగ్రెస్‌తో కలిసి పోలీసులు చేసిన పనిగా ఉందన్నారు. రుణమాఫీపై ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన చేయని కాంగ్రెస్‌ను ప్రజాక్షేత్రంలోనే నిలదీస్తామన్నారు. ఎన్ని దాడులు చేసినా రైతుల తరపున పోరాటం చేస్తామని జగదీ‌ష్‌రెడ్డి అన్నారు.

రుణమాఫీపై మంత్రులకే స్పష్టత లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న రుణమాఫీపై ఏ ఒక్క మంత్రికీ స్పష్టత లేదని, రోజుకో మంత్రి, ఒక్కో అంకెలు చెబుతున్నారని మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ ఎద్దేవాచేశారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని దీక్ష చేపడితే కాంగ్రెస్ పార్టీ గుండాలు తమ కార్యకర్తలపై దాడి చేయడం సరికాదన్నారు. దాడిచేసిన నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు.

ఓర్వలేకనే ప్రభుత్వంపై విమర్శలు

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వై నరేష్ అన్నారు. నిరసన దీక్ష సందర్భంగా నెలకొన్న ఘర్షణలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నాయకులు జుమ్మిలాల్, నాయిని కృష్ణలను కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. బీఆర్ఎస్ నాయకులు కావాలనే ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అంటేనే ప్రజాపాలన అని ప్రతి రైతుకూ రుణమాఫీ జరుగుతోందన్నారు.

రుణమాఫీపై కాంగ్రెస్ మోసపూరిత వైఖరి

సూర్యాపేట టౌన్, ఆగస్టు 22 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీపై మోసపూరిత వైఖరి అవలంబిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. రైతులకు రుణమాఫీ చేయాలంటూ బీఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం జిల్లా కేంద్రంలోని వాణిజ్యభవన్ సెంటర్‌లో ధర్నా నిర్వహించి, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబరు 9వ తేదీన ఒకసారి, ఆగస్టు 15వ తేదీ అని మరోసారి రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పి మాటతప్పాడని ఆరోపించారు. ఒక పక్క మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 17 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదని ప్రకటిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం రూ.31వేల కోట్లతో నూరుశాతం రుణమాఫీ అయ్యిందని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ఏప్రభుత్వం కూడా ఇంతలా రైతులను ఇబ్బందులకు గురిచేసిన దాఖలాలు లేవన్నారు. ధర్నా అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తిరుమలగిరిలో బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతల దాడిని ఆయన ఖండించారు. పోలీసుల సమక్షంలోనే శిబిరాన్ని కూల్చివేశారని కాంగ్రెస్, పోలీసులు కలిసి పనిచేస్తున్నట్లుగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, నాయకులు వై.వెంకటేశ్వర్లు, మునిసిపల్ వైస్‌చైర్మన్ పుట్ట కిశోర్‌కుమార్, గండూరి ప్రకాష్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జీడిబిక్షం, నెమ్మాది బిక్షం, సవరాల సత్యనారాయణ, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, జూలకంటి జీవన్‌రెడ్డి, కక్కిరేణి నాగయ్య, బూర బాలసైదులుగౌడ్, తాహెర్‌పాషా, బొమ్మగాని శ్రీనివాస్, అనిల్‌రెడ్డి, సుంకరి రమేష్ పాల్గొన్నారు.



సూర్యాపేటలో దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి



కొత్త రుణాల కోసం ఎదురుచూపు

రుణమాఫీ జరిగినా ఆలస్యమవుతున్న రెన్యూవల్

నల్లగొండ, ఆగస్టు 22: ప్రభుత్వం మూడు విడతల్లో ఉమ్మడి జిల్లాలో రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయగా, ఇంకా మాఫీ వర్తించని అర్హులైన వారి నుంచి గ్రీవెన్స్‌ల ద్వారా అర్జీలు తీసుకొని పరిశీలిస్తోంది. ప్రభుత్వం రుణమాఫీ నిధులు విడుదల చేసినా, పలు సాంకేతిక కారణాలతో మాఫీకి నోచుకోక రైతులు ఆందోళన చెందుతున్నారు. వీరి పరిస్థితి ఇలా ఉండగా, రుణమాఫీ పొందిన రైతులు కొత్త రుణాల కోసం పడిగాపులు పడుతున్నారు. రుణాల రెన్యూవల్ కోసం రైతులు బ్యాంకుల వద్ద క్యూ కడుతున్నారు. జాబితాలో పేరు ఉండటంతో 1-బీ, ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, పంటరుణం ఖాతా నెంబర్, సేవింగ్ ఖాతా జిరాక్స్‌లను సమర్పించేందుకు బ్యాంకు చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రైతుకు సంబంధించిన రుణమాఫీని ప్రక్రియన్ క్లియర్ చేసేందుకు గంటలకొద్దీ సమయం పడుతోంది. గ్రామీణ ప్రాంతాలల్లో సర్వర్ బిజీగా ఉండటం, నెట్ సరిగా పనిచేయకపోవడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలు దాటినా, రుణమాఫీకి అర్హులైన రైతుల వద్ద పెట్టుబడులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక అర్హత ఉండి మాఫీ కాని రైతులు ఆందోళనతో వ్యవసాయ అధికారుల చుట్టూ, బ్యాంకర్ల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

కొత్త రుణం కోసం తప్పని తిప్పలు

రుణమాఫీ జరిగిన రైతులు కొత్తరుణాలకు దరఖాస్తులు చేసుకుంటుండగా, రెన్యూవల్ ప్రక్రియ ఆలస్యమవుతోంది. దేవరకొండ నియోజకవర్గంలోని పీఏ.పల్లి మండలంలో రుణమాఫీ పొందిన రైతులు బ్యాంకుకు వెళ్లగా, వచ్చే నెల 5వ తేదీ తరువాత రావాలని రైతులకు చెప్పి పంపిస్తున్నారు. నల్లగొండ మండలం దోమలపల్లి బ్యాంకులో సైతం కొత్తరుణాల గురించి ఇప్పుడేం చేయలేమని, తాము ప్రస్తుతం రుణమాఫీ ప్రక్రియ బిజీలో ఉన్నామని బ్యాంకర్లు రైతులను తిప్పిపంపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని వాణిజ్య బ్యాంకులతో పాటు కోఆపరేటివ్ బ్యాంకుల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. రుణమాఫీ తొలి విడతలో నల్లగొండ జిల్లాలో 83,724మంది రైతులకు రూ.454.49కోట్లు మాఫీ కాగా, సూర్యాపేట జిల్లాలో 56,274మంది రైతులకు రూ.282.98కోట్లు, యాదాద్రి జిల్లాలో 37,285మంది రైతులకు రూ.203.82కోట్లు మాఫీ అయ్యాయి. రెండో విడతలో నల్లగొండ జిల్లాలో 50,409మంది రైతులకు రూ.503.89 కోట్లు, సూర్యాపేట జిల్లాలో 26,376 మంది రైతులకు రూ.250.8 కోట్లు, యాదాద్రి జిల్లాలో 19,798 మంది రైతులకు రూ.193.46కోట్లు మాఫీ కాగా, మూడో విడతలో నల్లగొండ జిల్లాలో 35,501మంది రైతులకు రూ.442.87 కోట్లు, సూర్యాపేట జిల్లాలో 17,773మంది రైతులకు రూ.213.24 కోట్లు, యాదాద్రి జిల్లాలో 13,011మందికి రూ.164.66కోట్లు మంజూరయ్యాయి. మాఫీ అయిన వారికి కొత్తగా రుణాలు ఇవ్వాల్సి ఉంది. అయితే రోజుల తరబడి రుణమాఫీ ప్రక్రియతో కొత్త రుణాలు ఇవ్వడం సమస్యగా మారుతోంది.

ఒక్కో బ్యాంకులో 20 కొత్త రుణాలే

ఉమ్మడి జిల్లాలో కొత్త రుణాలు ఇప్పటి వరకు కేవలం 30శాతం లోపే అయింది. ప్రతీ బ్యాంకులోనూ ఫీల్డ్ ఆఫీసర్ మాత్రమే కొత్త రుణాల ప్రక్రియను చూడాల్సి ఉంటుంది. ఫీల్డ్ ఆఫీసర్‌పై తీవ్ర పనిభారం పడుతుండటంతో కేవలం ప్రతీ రోజు ఒక్కొక్కరు 20 కొత్త రుణాల ఫైళ్లను మాత్రమే క్లియర్ చేస్తున్నారు. ఫీల్డ్ ఆఫీసర్‌తో పాటు బ్యాంక్ మేనేజర్లపై అధిక పని ఒత్తిడి పడుతోంది. పనివేళలకు మించి బ్యాంకులోనే ఉంటూ మూడు విడతలకు చెందిన రుణమాఫీ జాబితాను క్లియర్ చేయడం, మరోవైపు కొత్త రుణాలపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఉంది. ఈ సమస్యలు ఇలా ఉండగా, రుణమాఫీ పొందని రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. రాజకీయ పార్టీలు సైతం రుణమాఫీ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి. గ్రీవెన్స్‌ల ద్వారా వచ్చిన అర్జీలను పరిష్కరించే పనిలో వ్యవసాయశాఖ తలమునకలై ఉంది. వాస్తవానికి వ్యవసాయ సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలు దాటినా రుణమాఫీ సమస్యతో పాటు కొత్త రుణాలు కొలిక్కి రావడం లేదు. దీనికి తోడు రైతుబంధు స్థానంలో వచ్చిన రైతుభరోసాపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఓ నిర్ణయానికి రాకపోవడంతో రైతుభరోసా పెట్టుబడులు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆందోళన చెందుతున్న రైతులు

పంట రుణాల కోసం ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగం ఆందోళనకు గురవుతోంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ ఆయకట్టు కింద ముమ్మరంగా వరినాట్లు పడనున్నాయి. మెట్ట ప్రాంతాల్లో సైతం మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలకు ఎరువులు వేస్తున్నారు. ఇప్పటి వరకు పెట్టుబడులు చేతుల్లో లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుభరోసా వచ్చి ఉంటే పెటుబడులు వెళ్లేవి. కనీసం కొత్త రుణాలు వచ్చిన కూడా గట్టెక్కే పరిస్థితి ఉంటుంది. జూలై నెలలో మూడో వారంలో మొదటి విడత లక్ష రూపాయల వరకు రుణమాఫీ పొందిన రైతులతో పాటు గత నెల 30వ తేదీన రెండో విడత రూ.1.50లక్షలు, ఈనెల 15న రూ.2లక్షలు రుణమాఫీ పొందిన రైతులకు గతంలో ఎంత మేరకు రుణం ఇచ్చారో అంతే కొత్త రుణం ఇవ్వనున్నారు. దీనికి భిన్నంగా రూ.1.50లక్ష నుంచి రూ.2లక్షల వరకు కొత్తరుణం కావాలంటే ఇచ్చేందుకు బ్యాంకర్లు సుముఖంగా లేరు. గతంలో ఎంతరుణం ఉందో అంతే ఇవ్వాలని బ్యాంకర్లు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో అధికంగా పంట రుణంపై నిరాశ తప్పడం లేదు.

కొత్త రుణాలు ఇవ్వలేదు

నాకు ప్రభుత్వ రుణమాఫీ వర్తించింది. కొత్త రుణం కోసం బ్యాంకుకు వెళ్తే ఇంకా మంజూరు కాలేదు. త్వరగా కొత్త రుణం ఇచ్చి ఆదుకోవాలి. పెట్టుబడి లేక ఇబ్బందులు వస్తున్నాయి. సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలైంది. రైతుభరోసా కూడా ఇవ్వాలి. పెట్టుబడుల కోసం అప్పు చేయాల్సిన పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలి.

ఎస్‌కె.మహమూద్, కాశీవారిగూడెం తిప్పర్తి

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి



సువెన్ ఫార్మాలో మొక్క నాటుతున్న డీఎంహెచ్‌వో కోటా చలం, పరిశ్రమల శాఖ మేనేజర్ సీతారాములు

సూర్యాపేట రూరల్, ఆగస్టు 22 : ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని డీఎంహెచ్‌వో కోటా చలం, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సీతారాములు అన్నారు. గురువారం మండలంలోని సువెన్ ఫార్మా కంపెనీలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో వారు మొక్కలను నాటి, మాట్లాడారు. మానవ జీవనాధారానికి మొక్కలే ఆధారమన్నారు. ప్రతి ఒక్కరూ వనమహోత్సవంలో విరివిరిగా మొక్కలు నాటాలని సూచించారు, అదేవిధంగా సువెన్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. కంపెనీలో మొత్తం 50 మంది రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో యూనిట్ హెడ్ రమేష్‌బాబు, జనరల్ మేనేజర్ ఎంవీ రమణ, జగపతి రాయుడు, రమణ, నాగరాజు, భరత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పరిశ్రమలకు అనుమతులు ఇవ్వాలి

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 22 : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సకాలంలో అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీఐపీసీ, టీఎస్‌ఐపాస్‌కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తపరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులను పరిశీలించి సింగల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సంబంధించిన టీప్రైడ్ పథకం కింద 67 యూనిట్లు మంజూరు చేస్తూ తీర్మానించామన్నారు. టీఎస్-ఐపాస్ ఎనిమిది యూనిట్లకు అప్రూవల్ కమిటీతో రివ్యూ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఆటోనగర్‌కు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఇండస్ట్రీస్ మేనేజర్ టీ.సీతారాం, ఎల్‌డీఎం బాపూజీ, సీపీవో కిషన్, ఫైర్ అధికారి జానయ్య, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఆదిత్య, యాదగిరి, డీటీటీసీపీవో మాధవి, జిల్లా భూగర్భజల శాఖ అధికారి బాలు, శంకర్, వెంకటేశ్వర్లు, ఉదయభాస్కర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

సూర్యాపేటటౌన్, ఆగస్టు 22: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్. లత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 25వార్డులో పర్యటించి మాట్లాడారు. వ్యాధులు ప్రబలకుండ మురుగుకాల్వల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని, ఫాగింగ్ చేయాలని, దోమలను నిర్మూలించాలని సూచించారు. ప్రతి ఒక్కరు తమ పరిసరాల్లో చెత్తచెదారం వేయకుండ మునిసిపాలిటీ పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. రోడ్ల వెంట పశువులను కట్టి వేయరాదని పరిశుభ్రత పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ బి. శ్రీనివాస్, కౌన్సిలర్ ఆకుల కవిత లవకువ, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్.లత

నిరుద్యోగులకు ఉపయోగం లేని ఐటీ హబ్

- *నిర్లక్ష్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం*
- *ఐటీ హబ్‌ను పరిశీలించిన బీజేపీ నాయకులు*

నల్లగొండ, ఆగస్టు 22: జిల్లా కేంద్రమైన నల్లగొండ పట్టణంలో సుమారు రూ.96కోట్లతో నిర్మించిన ఐటీ హబ్ నిర్వీర్యంగా మారిందని, నిరుద్యోగులకు ఉపయోగం లేకుండా పోయిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ ఆరోపించారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారు ప్రసాద్‌తో కలిసి ఐటీ హబ్‌ను సందర్శించిన అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ హబ్ నిర్మించి వందల కంపెనీలు ఐటీ హబ్‌కు వస్తాయని, 3వేల మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని చెప్పి మోసం చేశారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి జాబ్‌మేళాను నిర్వహించినా, ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని, కేవలం 8 కంపెనీల్లో 40 నుంచి 50 మంది ఉద్యోగులు మాత్రమే పనిచేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ఐటీ హబ్‌ను దుర్వినియోగం చేసిందన్నారు. అదేవిధంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ నిరుద్యోగులను పట్టించుకోవడం లేదన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెలీకాప్టర్‌లో వచ్చి పోవడం తప్ప నియోజకవర్గాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఐటీ హబ్‌లో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయని అన్నారు. త్వరలోనే తమ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగుల పక్షాన ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చి వేయాలని అధికారులను ఆదేశించినా వారు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా రాజకీయాలు పక్కన పెట్టి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువతులకు స్కూటీలు ఉచితంగా ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని, ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ రాకుండా చేస్తామన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతేపాక సాంబయ్య, పెరిక ముని, రాఖీ, బొజ్జ నాగరాజు, గుర్రం వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఐటీ హబ్‌ను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఫ్లైఓవర్ బ్రిడ్జి పిల్లర్లతో నిర్మించాలి

చిట్యాల, ఆగస్టు 22: చిట్యాలలో జాతీయ రహదారిపై నిర్మించే ఫ్లైఓవర్ బ్రిడ్జ్ సిమెంట్ పిల్లర్లతో నిర్మించాలని అఖిలపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. గురువారం చిట్యాలలో సీపీఎం ఆధ్వర్యంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మట్టి కట్టతో నిర్మించడం వల్ల వ్యాపారాలు దెబ్బతింటాయని, చిట్యాల పట్టణం రెండు భాగాలుగా విడిపోతుందన్నారు. సిమెంట్ పిల్లర్లతో నిర్మించడం కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

ప్రాజెక్టులో నీరు.. కాల్వల్లో పారవు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. దీంతో ప్రాజెక్టు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆయకట్టుకు నీరందిం చేందుకు నిర్మించిన వరదకాల్వలు అధ్వానంగా ఉండడంతో చివరి భూములకు నీరందడం లేదు. చెట్లు, రాళ్లు నిండడంతో దిగువకు నీరు రాలేని పరిస్థితి ఉంది. చివరి ఆయకట్టు రైతాంగానికి నీరందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో దిగువ పంట పొలాలకు నీరు రాక రైతులు అయోమయంలో ఉన్నారు.



సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో కంపచెట్లతో నిండి ఉన్న మైనర్ కాల్వ

కుంచించుకుపోతున్న కాల్వలు

పాలకవీడు: నాగార్జునసాగర్ ఎడమకాల్వ కింద ఉన్న జాన్‌పహాడ్ మేజర్ ఆయకట్టు పాలకవీడు మండలంలో పరిస్థితి దారుణంగా ఉంది. కాల్వ చివరి భూములు కావడంతో ప్రతి ఏటా నీటికి కష్టాలు తప్పడం లేదు. జాన్‌పహాడ్ మేజర్ కింద బొత్తలపాలెం, అలింగాపురం, నాగిరెడ్డిగూడెం, పాలకవీడు, యల్లాపూరం, సజాపురం, జాన్‌పహాడ్ ప్రాంతాలకు నీరు చేరాలంటే కనీసం కాల్వ వదిలిన 15రోజుల వరకు కూడా నీరు వచ్చే పరిస్థితి లేదు. కాల్వ చివరి భూములు కావడంతో పాటు కాల్వల ఆధునికీకరణ కాలేదు. కాల్వలు కుంచించుకు పోయి చిన్నవిగా మారాయి. వాటికింద వున్నమైనర్ కాల్వలు చిన్నకాల్వలుగా ఉంటాయి. వాటిని ఉపాధిహామీ పనుల ద్వారా ఇటీవల నామమాత్రంగా తీశారు. జాన్‌పహాడ్ మేజర్ కాల్వ కింద పాలకవీడు మండలంలో సుమారు 15వేల ఎకరాలు సాగవుతుంది. జాన్‌పహాడ్ మేజర్ పరిధిలో మైనర్, సబ్‌మైనర్‌లుగా విభజించారు. ఆర్-9, ఆర్-10, ఆర్-11, ఆర్-12, ఆర్-13, ఆర్-14, ఆర్-15 సబ్ మైనర్ కాల్వలుగా మండలంలో సాగునీరు అందుతుంది. వీటిలో కొంత కాల్వ లైనింగ్ పనులు చేపట్టారు. కాల్వకట్టలకు లైనింగ్‌లేని చోట బలహీనంగా ఉన్నాయి. చాలా చోట్ల చెట్లతో కాల్వలు నిండి ఉన్నాయి. కాల్వనీరు చివరి భూములకు అందక పోవడంతో నిత్యం ప్రతిఏడాది రైతుల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. ఎగువ ప్రాంతంలో ఉన్న రైతాంగమే పూర్తిస్థాయిలో నీటిని వాడుకుంటుండడంతో కింది ఉన్న రైతులు వచ్చే కొద్దిపాటి నీటికి బోర్లు, బావులపై ఆధారపడి వరిసాగు చేస్తున్నారు.

రాజవరం చివరి భూములకు అందని సాగునీరు

తిరుమలగిరి(సాగర్): నాగార్జునసాగర్ ఎడమకాల్వకు మొదటి మేజర్ రాజవరం. దశాబ్దాలుగా ఆ మేజర్ పరిధిలోని చివరి భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. కొంపల్లి నుంచి బోయగూడెం, రాజవరం గ్రామాల చివరి రైతులు సాగునీటి కోసం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని ప్రతి ఏటా స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో అక్కడి రైతులు ఆవేదన చెందుతున్నారు. మేజర్ పరిధిలో మొత్తం ఆయకట్టు విస్తీర్ణం 8,900 ఎకరాలు కాగా అందులో సుమారు మూడు వేల ఎకరాల్లో గల చివరి భూములకు సాగునీరు అందే పరిస్థితి కన్పించడం లేదు. సాగర్ ఎడమకాల్వకు అల్వాల వద్ద రాజవరం మేజర్‌కు సాగునీటినీ అందించేందుకు ఎన్ఎస్పీ అధికారులు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి సుమారు 26కిలోమీటర్ల మేరా రాజవరం వరకు మేజర్ కాల్వను నిర్మించారు. మేజర్‌కు చివర ఉన్న సుమారు 18వ కిలోమీటర్ నుంచి 26వ కిలోమీటర్ వరకు ఈ ప్రాంత ఆయకట్టు రైతులకు సాగునీరు ఇబ్బందులు తప్పట్లేదని వాపోతున్నారు. మేజర్, మైనర్ కాల్వల్లో పేరుకపోయిన పూడికతీతను ఎన్ఎస్పీ సిబ్బంది చేపట్టడం లేదు.

ఫౌండేషన్ సహాయంతో పూడికతీత

రాజవరం మేజర్ కాల్వ ప్రారంభమయ్యే అల్వాల గ్రామ శివారు నుంచి మొదలుకోని ఎల్లాపురం సమీపంలోని 16వ కి.మీ వరకు బుసిరెడ్డి ఫౌండేషన్ సహకారంతో కాల్వలో పూడికతీత పనులు చేపట్టారు. సాగర్ జలాశయం నిండడంతో రాజవరం మేజర్‌కు సాగునీరు విడుదల చేసే అవకాశాలు ఉండడంతో రైతులు బుసిరెడ్డి ఫౌండేషన్ ఛైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డిని కలిసి కాల్వల పరిస్థితిని విన్నవించారు. ఈనెల మొదటి వారంలో మూడు ఎక్సవేటర్లు, మూడు డోజర్ల సహాయంతో మేజర్ కాల్వ ప్రారంభమయ్యే 0కిలో మీటర్ నుంచి ఎల్లాపురం సమీపంలోని 16వ కిలో మీటర్ వరకు సుమారు. రూ2.50లక్షలతో సుమారు వారం రోజుల పాటు యంత్రాలతో పనులు చేయించి మేజర్ కాల్వలో పేరుకపోయిన పూడిక తీయించి శుభ్రం చేయించారు. దీంతో ప్రస్తుతం ఎల్-4 కాల్వ వరకు సాగునీరు సాఫీగా అందుతున్నా 16వ కిలో మీటర్ నుంచి రాజవరం చివరి భూములైన 26వ కి.మీ వరకు కాల్వలో చెత్త, పిచ్చిచెట్లు పేరుకపోయి అస్తవ్యస్తంగా ఉండడంతో నీరు పారకపోవడంతో చివరి ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

వరదకాల్వలో పేరుకపోయిన చెట్లు

మాడ్గులపల్లి: వరదకాల్వ ద్వారా చివరి ఆయకట్టుకు నీరందించేందుకు ఏర్పాటు చేసిన వరదకాల్వ అధ్వానంగా మారింది. కాల్వలో చెట్లు, రాళ్లతో పేరుకపోయి నీరు కిందకు రాలేని పరిస్థితి ఉంది. సాగర్‌లో నీరు సమృద్ధిగా నీరు ఉన్నా వరద కాల్వకు నీరు విడుదల చేసి 20 రోజులవుతున్నా ఇప్పటి వరకు కిందకు నీరు రాకపోవడంతో వరదకాల్వ పరిధిలో ఉన్న కన్నెకల్, నారాయణపురం, దాచారం, మాడ్గులపల్లి, మర్రిగూడెం, తోపుచర్ల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాల్వల్లో ఉన్న కంపచెట్లను తొలగించకపోవడంతో నీరు కిందకు రావడం లేదని, అధికారులు వరదకాల్వపై పర్యవేక్షణ సక్రమంగా చేయకపోవడంతో కాల్వలు ఇలా తయారయ్యాయని గ్రామాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాల్వల మరమ్మతులు లేక..



కాల్వలో మొలిచిన కంపచెట్లు

పెన్‌పహాడ్: సాగర్ కాల్వ కింద ఉన్న ఎత్తిపోతల పథకాలు నిర్వహణ బాధ్యత రైతులకు అప్పగించడంతో కాల్వల మరమ్మతులు లేక చివరి భూములకు సాగునీరు అందక రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మండలంలోని అనంతారం ఎల్-24 పరిధిలో 1,200ఎకరాల ఆయకట్టు ఉంది. దోసపహాడ్ ఎల్-22, 23పరిధిలో 2,838ఎకరాల ఆయకట్టు ఉంది. నాగులపాటిఅన్నారం ఎల్-25,26 పరిధిలో 2,311 ఎకరాలు ఉన్నాయి. మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం కింద ఎల్-27లో పెన్‌పహాడ్ మండలంలోని లింగాల, దూపహాడ్, ఎల్లప్ప కుంటతండా, సీతమ్మతండా, బంజారా హిల్స్ గ్రామాలకు నాలుగు వేల ఎకరాలకు నీరు రావల్సి ఉంది. ఈ నాలుగు ఎత్తిపోతల పథకాల కింద కాల్వల మరమ్మతులు లేకపోవడంతో సుమారు 2,48ఎకరాల వరకు చివరి భూములు బీడు భూములుగా ఉండే పరిస్థితి నెలకొంది. రైతుల అసమర్థత, నిర్వహణ లోపంతో ఈ పరిస్థితి నెలకొంది. ఎత్తిపోతల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే చేపడితే అన్ని లిఫ్టుల కింద ఉన్న ఆయకట్టు భూములు సేద్యమయ్యే అవకాశంఉందని రైతులు తెలిపారు. మండలంలోని ఎస్సారెస్పీ కాల్వలను ఉపాధి కూలీలతో మరమ్మతులు చేసినప్పటికీ ఎస్సారెస్పీ కాల్వ లకు సాగునీరు రాక కాల్వలన్నీ నిరుపయోగంగా ఉన్నాయి.

చివరి రైతులకు సాగు భారం

దామరచర్ల: దిగువ ఆయకట్టు ప్రాంతమైన దామరచర్ల, అడవిదేవులపల్లి మండలా లకు తాగు, సాగునీరందని పరిస్థితి నెలకొంది. కాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడమే దీనికి కారణం. దామరచర్ల మండలంలోని వజీరాబాద్ మేజర్ కాల్వకు సుమారు 500క్యూసెక్కుల నీటిని విడుదల చేసినా ఆయకట్టు చివరి భూములకు నీరం దని పరిస్థితి ఉంది. ఎగువ ప్రాంతంలో సాగువిస్తీర్ణం ఇటీవల గణనీయంగా పెరిగింది. దీంతో ఎగువ రైతులు అక్రమంగా షట్టర్లు ధ్వంసం చేయడం, కాల్వలకు గండ్లు పెట్టడంతోపాటు అడ్డుకట్టలు వేస్తుండడంతో దిగువకు నీరందడం లేదు. వజీరాబాద్ మేజర్ పరిధిలోని దామరచర్ల, వాచ్యాతండా, తాళ్లవీరప్పగూడెం, బొత్తలపాలెం, ఇర్కి గూడెం, వాడపల్లితోపాటు పలు గ్రామాల్లోని సుమారు 10వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందని పరిస్థితి ఉంది. తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ముదిమాణిక్యం మేజర్ పరిధిలోని అడవి దేవులపల్లి మండలంలోని ముదిమాణిక్యం, అడవిదేవుల పల్లి, బాల్నెపల్లి, చిట్యాల గ్రామాతోపాటు పలు గ్రామాల్లోని చివరి భూములకు నీరందడంలేదని అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో నిండిన వజీరాబాద్ మేజర్ పరిధిలోని మైనర్ కాల్వ

చెరువులు నింపేదెన్నడో?

నిడమనూరు: రెండేళ్ల తర్వాత నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో కాల్వలకు నీటిని విడుదల చేశారు. కాల్వల నిండా నీటితో ప్రవహిస్తున్నప్పటికీ మండలంలోని చెరువులు మాత్రం ఎండిపోయి ఉన్నాయి. సాగర్ నీటితో చెరువులను నింపాలని కలెక్టర్ సైతం ప్రకటించారు. కానీ చెరువులకు నీరు కూడా చేరలేదు. మండలంలో నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో 23చెరువులు ఉన్నాయి. రెండేళ్లుగా సరైన వర్షాలు లేనందున చెరువులు ఎండిపోయాయి. కొన్ని చెరువుల్లో చుక్క నీరు లేక మైదానంలా కనిపిస్తున్నాయి. కాల్వలకు నీటిని వదలడంతో చెరువులు నింపుతారని రైతులు ఆశించారు. కలెక్టర్ కూడా ప్రకటనలు చేయడంతో చెరువులు నింపడంపై రైతుల్లో ఆశలు పెరిగాయి.

ఫీడర్ చానళ్లు లేక ఇబ్బందులు: సాగర్ నీటితో నేరుగా చెరువులు నింపడానికి ప్రత్యేక తూములు, ఫీడర్ చానళ్లు లేవు. పంట పొలాల ద్వారా వచ్చే ఎంతోకొంత నీరే శరణ్యం. ప్రభుత్వాలు చర్యలు తీసుకొని ఫీడర్ చానళ్లు, ప్రత్యేక తూములు ఏర్పాటు చేస్తే చెరువులను సాగర్ నీటితో నింపడం సులభంగా ఉండేది. అవేమీ లేకపోవడంతో చెరువులు నింపడం సాధ్యం కావడం లేదు. వరద కాల్వ నీటితో మండలంలోని గుంటిపల్లి, ఊట్కూరు చెరువులు నిండే అవకాశముంది. అనుముల మండలం మారెపల్లి పరిధిలో ఇటీవల వరద కాల్వకు గండి పడడంతో నీటి విడుదల ఆలస్యమై చెరువులకు నీరు చేరడం లేదు.



నీరు లేక ఎండిపోయిన నిడమనూరు చెరువు

చెరువులకు చేరని సాగర్ జలాలు



నీటి లభ్యత లేక ఎండిన కందిబండ పెద్దచెరువు

మేళ్లచెర్వు: నాగార్జునసాగర్ జలాలు విడుదల చేసి 20 రోజులు అవుతున్నా చెరువులు నింపడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మండల పరిధిలోని అనేక చెరువులకు నేటి వరకు సాగర్ జలాలు చేరకపోవడంతో పాటుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులలో వర్షపు నీరు కూడా చెరువులోకి రాకపోవడంతో మండల వ్యాప్తంగా ఉన్న చెరువుల కింద సాగు ఆలస్యం అవుతుందని రైతులు చెబుతున్నారు. అధికారులు, మంత్రి ఆదేశాల మేరకు ప్రత్యేక చొరవ తీసుకొని ఆయకట్టులోని చెరువులను సాగర్ నీటిలో నింపాలని రైతులు కోరుతున్నారు.



ముల్కలకాల్వ వద్ద పిల్ల కాల్వను తలపిస్తున్న మేజర్

పేరుకే ముల్కలకాల్వ మేజర్

మిర్యాలగూడ రూరల్: చివరి గ్రామమైన ముల్కలకాల్వకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేజర్ కింద దొండవారిగూడెం, తడకమళ్ల, తక్కెళ్లపాడు, ఉట్లపల్లి, కాల్వపల్లి, సుబ్బారెడ్డిగూడెం, అవంతీపురం, ఆలగడప, రాయినిపాలెం గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములకు, చెరువులను నింపేందుకు ముల్కలకాల్వ మేజర్ ప్రధానమైంది. ఏళ్ల తరబడి మేజర్ ద్వారా చివరి గ్రామానికి సాగునీరు అందడం లేదని అధికారులకు చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ముల్కలకాల్వ గ్రామ పరిధిలో సుమారు 1,700 ఎకరాలకు పైగా సాగునీరు అందించాల్సి ఉన్నప్పటికీ మేజర్ కాల్వ పిల్ల కాల్వను తలపించేలా మారింది. అవంతీపురం, ఆలగ డప, రాయినిపాలెం వరకు విస్తృతంగా ప్రవహిస్తున్న మేజర్ కాల్వకు తూముల వద్ద షట్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో పొలాల్లోని మడుల్లో నీళ్ల నిండి సాగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ముల్కలకాల్వకు సమీపంలోని ఆలగడప క్యాంపు వద్ద రహదారిపై కాల్వ ప్రవహిస్తున్నా ఎన్ఎస్పీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రాయినిపాలెం వరకు ప్రవహిస్తున్న నీరు ముల్కలకాల్వ చేరుకునే వరకు పిల్లకాల్వలో వృథా నీరు ప్రవహిస్తున్న మాదిరిగా దుస్థితి నెలకొంది.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

కట్టంగూరు, ఆగస్టు 22: తాళం వేసిన ఇళ్లలో రాత్రిపూట దొంగతనాలకు పాల్పడిన దొంగను నల్లగొండ జిల్లా కట్టంగూరు పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణం గణేష్ టెంపుల్ గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్ రాత్రి సమయాల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న బంగారు అభరణాలు, డబ్బులు దొంగిలించేవాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఇర్ఫాన్‌పై 15కేసులు ఉన్నాయి. 2024 ఆగస్టు 2వ తేదీన ఖమ్మంకు చెందిన అబ్రారుద్దీన్‌కు చెందిన ద్విచక్ర వాహనం తీసుకున్న ఇర్ఫాన్ నకిరేకల్ పట్టణంలో ఫ్లైఓవర్ కింద హెయిర్ కటింగ్ షాప్ తాళం పగులగొట్టి రూ.12వేలు దొంగిలించాడు. అయిటిపాముల గ్రామంలో ఓ ఇంటి తాళం పగులగొట్టి రెండు తులాల బంగారు నెక్లెస్, తులం చెవి దిద్దులు, మాటీలు, వెండి పట్టీలు, పావుతులం నల్లపూసల గొలుసు, రూ.3వేల నగదు దొంగిలించాడు. గురువారం నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇర్ఫాన్ పట్టుబడినట్లు ఎస్ఐ ఎన్. శ్రీను తెలిపారు. నేరస్థుడి నుంచి రెండు తులాల బంగారు నెక్లెస్, తులం చెవి దిద్దులు, మాటీలు, పావు తులం నల్లపూసల గొలుసు, రూ.3వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఇనుపరాడ్లు ఇనుప కత్తెర స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చింతపల్లి, ఆగస్టు 22: నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పోలేపల్లిరాంగర్ గ్రామ శివారు బస్‌షెల్టర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 65 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి పది రోజులుగా గ్రామంలో భిక్షాటన చేస్తూ బస్‌షెల్టర్‌లో ఉండే వాడు. గ్రామ కార్యదర్శి గుర్రం ప్రదీప్‌కుమార్ గురువారం ఉదయం మాల్ నుంచి ద్విచక్ర వాహనంపై మండల కార్యాలయానికి వెళ్తుండగా గ్రామ శివారు బస్‌షెల్టర్‌లో నిర్జీవంగా పడి ఉన్న ఆ వ్యక్తిని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా మృతదేహాన్ని దేవరకొండలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రదీప్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ ఇద్దరు మృతి

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 22: టైర్ రీట్రెడింగ్ కంపెనీ యజమాని దాడిలో గాయపడి కోమాలోకి వెళ్లిన వ్యక్తి చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి సమీప బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రగూడెం సమీపంలోని వంశీటైర్ రీట్రెడింగ్ కంపెనీలో హౌసింగ్‌బోర్డుకు చెందిన వేల్పుల గోపయ్య(53) కొంతకాలంగా పనిచేస్తున్నాడు. పనికి ఆలస్యంగా వచ్చాడన్న ఆగ్రహంతో కంపెనీ యజమాని అలుగుబెల్లి రాఘవరెడ్డి కర్రతో గోపయ్యపై దాడిచేశాడు. జూన్ 29న జరిగిన ఈ సంఘటనలో తలకు బలమైనగాయమై గోపయ్య కోమాలోకి వెళ్లాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. కంపెనీ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మృతుడి బంధువులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసి ఆందోళనకు సిద్ధమయ్యారు. ఎస్ఐ సుధీర్‌కుమార్ స్పదించి న్యాయం చేస్తామంటూ హామీ ఇచ్చారు. టైర్ రీట్రెడింగ్ కంపెనీ ప్రతినిధులనుస్టేషన్‌కు రప్పించారు. దీంతో కొందరు పెద్దమనుషులు జోక్యం చేసుకొని ఇరువర్గాలతో చర్చలు జరిపి నష్టపరిహారం చెల్లించేలా రాజీకుదిర్చడంతో మృతుడి బంధువులు శాంతించి వెళ్లిపోయారు. కాగా గోపయ్యకు భార్య చంద్రకళ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన కాంగ్రెస్ కార్యకర్త మృతి

బోనాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తన ఫొటో ఉంచకుండా అవమానించారన్న మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ నెల 17వ రాత్రి మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన ఆటో డ్రైవర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తేజావత్ భగవాన్‌నాయక్(42) ఒంటిపై పెట్రోల్‌పోసుకొని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడ్డ భగవాన్‌నాయక్ హైదరాబాద్ గాంధీఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఐదురోజులుగా మృత్యువుతో పోరాడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కాగా భగవాన్‌నాయక్ మృతికి కారణమైనవారిపై బాధితకుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



జానీపాషా మృతదేహం

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 22: రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామం వద్ద కోదాడ -జడ్చర్ల రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన షేక్ జానీ పాషా(37) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా నుంచి టమాట లోడ్‌తో మిర్యాలగూడకు వస్తున్న క్రమంతో తుంగపాడు గ్రామం వద్దకు రాగానే వేగంగా ముందు వెళ్తున్న టీజీ12టీ 0960 నెంబర్‌గల డీసీఎం లారీ డ్రైవర్ స్పీడ్ బ్రేకర్ వద్ద సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వస్తున్న టీఎస్05 యూఎఫ్ 0311 నెంబర్‌గల డీసీఎం వాహనం అదుపుతప్పి వెనకనుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో డీసీఎం నడుపుతున్న డ్రైవర్ జానీపాషాకు ఛాతి, కాళ్ల వద్ద బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. జానీపాషా భార్య ఆరీఫా ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన మరో డీసీఎం డ్రైవర్ ఖాజాషరీఫ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

చందంపేట: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చందంపేట మండలం లోని గుంటిపల్లి స్టేజీ వద్ద బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఆర్కపల్లికి చెందిన జటావత్ మధు(21) బుధవారం చందంపేట మండలం పోల్యానాయక్‌తండాలో ఉంటున్న తన అక్క వద్దకు సీత్లాపండగకు వచ్చాడు. ద్విచక్రవాహనంపై తిరిగి తన స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గంమధ్యలో గుంటిపల్లి స్టేజీ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మధు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్యలు

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 22: విధులకు గైర్హాజరై విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన పీఏపల్లి మండలం మేడారం గ్రామ పంచాయతీ కార్యదర్శి కె. అనూష, వనమహోత్సవం కింద మొక్కలు నాటకపోవడం, ఇచ్చిన మొక్కల నిర్దేశాన్ని పూర్తి చేయకపోవడమే కాక మొక్కల గురించి తప్పుడు సమాచారం ఇచ్చిన మేడారం ఫీల్డ్ అసిస్టెంట్ ఎం. శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర జిల్లా పంచాయతీ అధికారిని గురువారం ఆదేశించారు. ఆకస్మిక తనిఖీలో భాగంగా పీఏపల్లి మండలం మేడారం గ్రామ పంచాయతీని అదనపు కలెక్టర్ సందర్శించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమ నిర్వహణ తర్వాత క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు పరిశీలించాడు. ఆ సమయంలో పంచాయతీ కార్యదర్శి కె. అనూష గ్రామంలో అందుబాటులో లేరని, ఎంపీడీవో, ఇతరపై అధికారులకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైనట్లు తెలుసుకున్నారు. గ్రామంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహించలేదని గుర్తించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారులకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించలేదని, వనమహోత్సవం కింద 2,370 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా అందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదన్నారు. రహదారులకు ఇరువైపులా నాటిన 200మొక్కలు ఎండిపో యాయని, మొక్కలు నాటేందుకు రహదారుల ఇరువైపులా గుంతలు తవ్వించలేదని పేర్కొంటూ పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు.

మెప్మా ఉద్యోగి సస్పెన్షన్

మిర్యాలగూడ టౌన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మునిసిపాలిటీలోని మెప్మా విభాగంలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి సస్పెండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న శ్రీనివాస్‌పై లైంగిక వేధింపులు, లంచం తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో అతనిపై మెప్మా పీడీని విచారణకు ఆదేశించారు. విచారణలో ప్రాథమికంగా ఆరోపణలు నిర్ధారణ అయిన నేపథ్యంలో శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేసినట్లు కమిషనర్ యూసుఫ్ తెలిపారు.

అడ్లూరు గ్రామాన్ని సందర్శించిన వైద్య సిబ్బంది

శాలిగౌరారం, ఆగస్టు 22: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని పలు గ్రామాల్లో డెంగీ కేసులు నమోదు అవుతున్నాయి. దీంతో వైద్య సిబ్బంది అప్రమత్తమవుతున్నారు. మండలంలో ఒకరికి డెంగీ రావడంతో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం పెర్కకొండారం, శాలిగౌరారం, వల్లాల గ్రామాల్లో కూడా డెంగీ కేసులు నమోదు కావడంతో బాధితులను వైద్య సిబ్బంది నల్లగొండ, నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించి చికిత్స చేయించారు. ప్రస్తుతం వర్షంకాలం కావడంతో అన్ని గ్రామాల్లో వైరల్ ఫీవర్లు సోకడంతో కొంతమంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో మరికొందరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.



అడ్లూర్ గ్రామస్థులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా నివారణ అధికారి దుర్గయ్య

పరిశుభ్రత పాటించాలి: జిల్లా మలేరియా నివారణ అధికారి

మండలంలోని అడ్లూర్ గ్రామాన్ని జిల్లా మలేరియా నివారణ అధికారి దుర్గయ్య గురువారం సందర్శించారు. వైద్య సిబ్బందితో కలిసి డెంగీ సోకిన వ్యక్తి ఇంటితో పాటు గ్రామంలోని పలు వీధులను పరిశీలించారు. ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈగలు, దోమలతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు వ్యాపించే ప్రమాదముందన్నారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. జ్వరం రాగానే గ్రామంలో ఉండే వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు కె.సుమతి, బి.సునీత, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, పద్మ, ఆశా వర్కర్లు సునీత, కొమరమ్మ, రేణుక తదితరులు ఉన్నారు.

రేపు స్పాట్ కౌన్సిలింగ్

నల్లగొండ, ఆగస్టు 22: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల నకిరేకల్ బాలుర కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి ఎంపీసీ విభాగంలో ఖాళీగా ఉన్న 40సీట్ల భర్తీకి ఈనెల 24 శనివారం స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మధుకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ పొందే విద్యార్థులు, మార్చి 2024 పదవ తరగతిలో ఉత్తీర్ణులై ఉండి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారు రూ.1.50లక్షలు ఉండాలని పేర్కొన్నారు. అర్హత గల విద్యార్థులు ఈ నెల 24న ఉదయం 9గంటలకు చెరువుగట్టులోని గల కళాశాల ఆవరణలో స్పాట్ అడ్మిషన్‌కు హాజరు కావాలని కోరారు. మరిన్న వివరాలకు సెల్: 7995010663, 7799573366 నెంబర్లలలో సంప్రదించాలని కోరారు.

బస్సు అద్దాల ధ్వంసం.. డ్రైవర్‌పై దాడి

కనగల్, ఆగస్టు 22: బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు ఆపలేదనే కోపంతో డ్రైవర్‌పై ఇద్దరు ప్రయాణికులు దాడి చేసి బస్సు అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దేవరకొండ డిపోకు చెందిన బస్సుఏపీ29 - 948 గురువారం సాయంత్రం దేవరకొండ నుంచి నల్లగొండకు ప్రయాణికులతో వస్తుంది. ఈ క్రమంలో గుర్రంపోడు మండలం కొప్పోల్ గ్రామ స్టేజీ వద్ద గల బస్టాప్‌లో బస్సును ఆపలేదనే కోపంతో ఇద్దరు ప్రయాణికులు బస్సును అడ్డగించి డ్రైవర్‌పై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. కాగా దాడి చేసిన వారిపై బస్సుడ్రైవర్ మహమూద్, కండక్టర్ షాకీరాబేగం కనగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెట్టుకు బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలు

కనగల్, ఆగస్టు 22: నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రం గ్రామశివారులో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం జరిగింది. ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... గుర్రంపోడు మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన మాతంగి ప్రసాద్, మామిడి సైదులు, పెద్ద ఎల్లయ్య దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయం వద్ద బంధువులు నిర్వహించిన శుభకార్యానికి హాజరైన వీరు బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. కాగా కనగల్ గ్రామశివారులో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు?

కోదాడ రూరల్, ఆగస్టు 22: ఆంధ్రా ప్రాంతం నుంచి తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని సూర్యాపేట జిల్లా కోదాడ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. రెడ్లకుంట, కూచిపూడితండా, చిల్లకల్లు, నల్లబండగూడెం, దొరకుంట గ్రామాలకు చెందిన ఐదుగురు యువకులు ఆంధ్రా ప్రాంతం నుంచి గత కొంతకాలంగా గంజాయిని తీసుకొచ్చి చిన్నచిన్న పొట్లాలు చేసి గ్రామాల్లో విక్రయిస్తున్నారు. కొంతమంది వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు బుధవారం రాత్రి ఈ ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని, వారి వద్ద నుంచి ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా, విచారణ కొనసాగుతుందని, వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.

విశ్రాంత ఉపాధ్యాయుడిపై వానరాల దాడి

భువనగిరి టౌన్, ఆగస్టు 22: విశ్రాంత ఉపాధ్యాయుడిపై వానరాలు దాడి చేసి గాయపరిచాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలో గురువారం జరిగింది. స్థానిక పోచమ్మ వాడకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పోతంశెట్టి పాండయ్య(87) బుధవారం రాత్రి ఇంటి ఎదుట కుర్చీలో కూర్చున్నాడు. గుంపుగా వచ్చిన వానరాలు అకస్మాత్తుగా ఆయనపై దాడి చేశాయి. కుర్చీ నుంచి కిందపడిన ఆయన కుడి చెవిని వానరాలు కొరికి వేశాయి. అలాగే వాటి దాడిలో ఒంటినిండా గాయాలయ్యాయి. ఆయన అరుపులు వేయడంతో అప్రమత్తమైన స్థానికులు, కుటుంబసభ్యులు వానరాలను తరిమివేశారు. గాయపడిన పాండయ్యను జిల్లా ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుత ఆయన ఆరోగ్యం క్షేమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే కోతుల నియంత్రణలో మునిసిపాలిటీ చూపుతున్న నిర్లక్ష్యంతోనే ప్రజలపై కోతుల నిత్యం దాడులు చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వానరాలను కట్టడి చేయాలని కోరుతున్నారు.

ఆంక్షలు లేకుండా రుణాలను మాఫీ చేయాలి

● బీఆర్‌ఎస్ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లం మల్లయ్యయాదవ్ ● జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

కోదాడ టౌన్, ఆగస్టు 22: ఆంక్షలు లేకుండా రైతులకు పంట రుణాలను మాఫీ చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు కోదాడలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మల్లయ్యయాదవ్ మాట్లాడుతూ రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సగం మంది రైతులకే పంట రుణాలను మాఫీ చేసి మోసం చేసిందని ధ్వజమెత్తారు. రైతులందరికీ రుణ మాఫీ చేయకుంటే రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటాలు చేస్తుందనిహెచ్చరించారు. అనంతరం ఆర్డీవోకి వినతిప్రతం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, రైతు సంఘాల నాయకులు, రైతులు, పాల్గొన్నారు.



మేళ్లచెర్వులో తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుజూర్‌నగర్: ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేయాలని హుజూర్ నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కొప్పుల సైదిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర రావు కోరారు. గురువారం హుజూర్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట, ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి పలు సమస్యలను పరిష్క రించాలని కోరుతూ డీఏవో రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయడంలేదని ఆరోపించారు. అనంతరం తెలం గాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో అమర్, ముల్క లపల్లి రాంబాబు, భాస్కర్‌రెడ్డి, భిక్షం, శంభిరెడ్డి, కొండారెడ్డి, అలీ, రాజారావు, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, మునీర్, శ్రీను, చారి, పరశురాం, సుందరయ్య, రామనర్సమ్మ, సైదేశ్వరరావు, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: రైతులందరికీ ఒకే దఫా రూ.2లక్షల వరకు పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గరిడేపల్లి తహసీ ల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అనంతరం తహసీల్దార్ బండ కవితకు వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా కృష్ణానాయక్ మాట్లాడుతూ కొందరికి మాత్రమే పంట రుణాలను మాఫీ చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వ యకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంక టరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, వెంకటరమణారెడ్డి, రామారావు, శోభన్‌బాబు, రాజమహ్మద్, వెంకట్రాములు, వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, శ్రీహరి, చిన వెంకట రెడ్డి, రామకృష్ణ, సైదులు, నగేష్, నారాయణ, హేమ్లు పాల్గొన్నారు.



కోదాడలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

పాలకవీడు, నేరేడుచర్ల: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ పంట రుణాలను మాఫీ చేయాలని బీఆర్‌ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చా ర్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు పాలకవీడు, నేరేడుచర్ల మండ లాల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేసి పాలకవీడులో డిప్యూటీ తహసీల్దార్ కమలాకర్‌కు, హుజూర్‌నగర్‌లో తహసీ ల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అప్పిరెడ్డి, అంజిరెడ్డి, సురేష్‌బాబు, శ్రీధర్, వెంకట్‌రెడ్డి, జ్యోతి, సైదులు పాల్గొన్నారు.

మఠంపల్లి: అర్హత కలిగిన రైతులందరికీ పంట రుణాలను మాఫీ చేయా లని బీఆర్‌ఎస్ నాయకుడు మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ఆధర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ మంగారాథోడ్‌కు వినతిపత్రం అంద జేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటరెడ్డి, నాయకులు అశోక్‌నాయక్, భద్రంరాజు రామారావు, కోటానాయక్, రామచంద్రయ్య, హఫీజ్‌ఖాన్, జాల కిరణ్‌యాదవ్, ఇరిగెల వెంకటరెడ్డి, వీరారెడ్డి, రాజీవ్, మట్టయ్య, గోవర్ధన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: రాష్ట్రంలో రైతులందరికీ రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు మేళ్లచెర్వు, చింతలపాలెం తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మేళ్లచెర్వు మండల అధ్యక్షుడు సూరిశెట్టి బస వయ్య, పందిరిపల్లి శంకర్‌రెడ్డి, పసుపులేటి రాజా, బాల్ వెంకట్‌రెడ్డి, చింతల పాలెం నాయకులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



గరిడేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



నేరేడుచర్లలో మాట్లాడుతున్న ఒంటెద్దు నర్సింహారెడ్డి

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



గరిడేపల్లిలో మొక్క నాటుతున్న ఎంపీడీవో ఆర్.సరోజ

గరిడేపల్లి, ఆగస్టు 22: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వనమహోత్స వంలో భాగస్వాములు కావాలని గరిడేపల్లి ఎంపీడీవో ఆర్.సరోజ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా 'నాటుదాం ఒక మొక్క.. అమ్మ పేరిట' కార్యక్ర మంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో మొక్కు నాటి ఆమె మాట్లాడారు. ఉమండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మొక్కలు నాటి నట్లు తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సురేష్, ఈసీ సుజాత, పంచాయతీ కార్యదర్శి నాగే శ్వరరావు, టీఏ శిరీష, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరితగౌడ్, బిల్‌కలెక్టర్ సతీష్, నర్సిరెడ్డి, నాగరాజు, పద్మ, శాంత, అంజమ్మ రమణ పాల్గొన్నారు.

31 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

గరిడేపల్లి, ఆగస్టు 22: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)అండర్ 14, 17 బాలబాలికల మండల స్థాయి ఆటలను ఈ నెల 31వ తేదీ నుంచి సెప్టెంబరు మూడో తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో పాను గోతు ఛత్రునాయక్ తెలిపారు. గురువారం గరిడేపలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల పాఠశాలల పీఈటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 31న కబడ్డీ, పొనుగోడులోని జడ్పీ హైస్కూల్‌లో సెప్టెంబరు మూడో తేదీన ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బి.హుస్సేన్, ఫిజికల్ డైరక్టర్లు, పీఈటీలు రాంప్రసాద్, సైదిరెడ్డి, అంబేడ్కర్, ధనమ్మ, ప్రమీల, బాబు, ప్రదీప్‌కుమార్, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు జానకిరెడ్డి, నరసా రావు, కల్పన, శాంతకుమారి, శశికళ, సీఆర్పీలు రామకృష్ణ, అశోక్, తదిత రులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



నేరేడుచర్లలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, ఆగస్టు 22: ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయా లని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాల ధనుంజయనాయుడు కోరారు. గురువారం నేరేడుచర్ల మండలకేంద్రంలో ఆటో డ్రైవర్లను కలిసి వారి ఆర్థిక పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బస్సులు నడవలేని చిన్న చిన్న గ్రామాలు, పట్టణాల వీధుల్లోని ప్రజలను రవాణా చేస్తున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రతి ఆటో కార్మికుడికి రూ.15వేల ఆర్థికసాయం, ఇళ్లు, ఆరోగ్య భద్రత కార్డు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట్, వేణు, అంజి, గోపి, వివేక్ పాల్గొన్నారు.

రూ.11కోట్లతో పంచాయతీ భవనాల నిర్మాణం

హుజూర్‌నగర్, ఆగస్టు 22: హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో రూ.11కోట్లతో 28గ్రామపంచాయతీ భవనాలు, 45అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు నిర్మించనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మా వతిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ తేజ స్‌నందాలాల్‌పవార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారన్నారు. హుజూర్ నగర్ నియోజకవర్గంలో గోపాలపురం, కరక్కాయలగూడెం, చింతలపాలెం, రేబల్లె, వెంకట్రాంపురం, భీల్యానాయక్‌తండా, చెన్నాయిపాలెం, రఘునాథ పాలెం, సుల్తాన్‌పూర్‌తండా, కప్పలకుంటతండా, రాఘవపురం చెరువు తండాలకు, కోదాడ నియోజకవర్గంలోని కొత్తగూడెం, పాలారం, పాలారం తండా, వసంతాపురం, పాతగోల్‌తండా, వాయిలసింగారం, ఆర్లెగూడెం, పోలేనిగూడెం, రామాపురం, గుడిబండ, కాపుగల్లు, రెడ్లకుంట, తొగర్రాయి, మంగలితండా, నేరేడువాయి, నామవరం, నడిగూడెం గ్రామాలకు గ్రామ పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న



అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మీలా వాసుదేవ్

సూర్యాపేట టౌన్, ఆగస్టు 22: అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా వాసుదేవ్ అన్నారు. కాంగ్రెస్ నాయ కుడు రాచకొండ శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అన్నదానం, అల్పాహారం కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. పండుగలు, పుట్టినరోజుల సందర్భంగా ప్రతిఒక్కరూ పేదలకు అన్నదానం, ఆర్థికసాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాచర్ల కమలాకర్, గండూరి కృపాకర్, కలకోట్ల లక్ష్మయ్య, ఫణేంద్రకు మార్, నాగరాజు, పురుషోత్తం పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ నాయకుడి మృతి



కృపాకర్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

నూతన్‌కల్, ఆగస్టు 22: మండలంలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మర్రి కృపాకర్‌రెడ్డి(64) గుండెపోటుతో హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన మృతికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, చంద్రకళ, బాణాల సుదర్శన్ రెడ్డి, బత్తుల నాగమల్లు సంతాపం తెలిపారు..

సంప్రదాయబద్ధంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, ఆగస్టు 22: మండలంలోని ప్రసిద్ధ మట్టపల్లి క్షేత్రంలో మంగళ వారం లక్ష్మీనృసిం హుని నిత్య కల్యా ణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల యంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహ వాచనం, రక్షాబం ధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టప ల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

కాపులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కె.నాగేశ్వరరావు

హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 22: మున్నూరు కాపులకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.నాగేశ్వర రావు కోరారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్యపటేల్ పిలుపు మేరకు కాపుల సమస్య లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ సంఘం నాయకులు గురువారం పట్ట ణంలో మౌన దీక్ష చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోకాపేటలోని ఎంకే టవర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.100కోట్లు కేటాయించాలని, కాపు కార్పొరేషన్ చైర్మన్‌ను వెంటనే నియమించాలని, తెలంగాణ వ్యాప్తంగా కాపు సంక్షేమానికి రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరారు. నామినేటెడ్ పోస్టులలో కాపులకు ప్రాధా న్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కామిశెట్టి వెంకటేశ్వర్లు, శాసనాల నాగసై దయ్య, తోట భిక్షం, బండారు మహేష్, కాసర్ల నాగేశ్వరరావు, తోట వీరస్వామి, ఆవుల వెంకటయ్య, తోట శ్రీనివాస్, నర్సింహారావు, ఆవుల చంద్రయ్య, ఏనుగుల సత్యనారాయణ, కరెంట్ వెంకటేశ్వరరావు, గంధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పురుగుమందు తాగిన గొర్రెలకు వైద్యం

కోదాడ రూరల్, ఆగస్టు 22: పురుగు మందు తాగిన గొర్రెలకు కోదాడలోని పశువైద్యశాలలో వైద్యాధికారి పెంటయ్య గురువారం వైద్యం నిర్వహించి వాటి ప్రాణాలను కాపాడారు. కోదాడ ప్రాంతంలో సాలార్జంగ్‌పేటలో పందుల కోసం ఏర్పాటు చేసిన పురుగు మందును జీవాలు తాగి అస్వస్థతకు గురికావడంతో వెంటనే స్థానికులు కోదాడ పశువైద్యశాలకు తీసుకురాగా పెంటయ్య వైద్యం అందించారు. గొర్రెల పెంపకదారులు జాగ్రత్తలు వహించాలని ఆయన కోరారు.

కోదాడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సూరయ్య

కోదాడ రూరల్, ఆగస్టు 22: కోదాడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సోమపంగు సూరయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సాయిగౌడ్‌పై పలు అవినీతి ఆరోపణలు రావడంతో ఆయనను కలెక్టర్ బదిలీ చేశారు. ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ సూరయ్యను ఇన్‌చార్జి తహసీ ల్దార్‌గా నియమించారు.

కోళ్ల పెంపకంతో మహిళలకు ఆదాయం



మేళ్లచెర్వులో మాట్లాడుతున్న మండల పశువైద్యాధికారి ఉషారాణి

మేళ్లచెర్వు, ఆగస్టు 22: ఇంటి పెరట్లో కోళ్ల పెంపకం ద్వారా మహి ళలకు ఆదాయం సమకూరుతుందని మండల వైద్యాధికారి ఉషారాణి అన్నారు. గురువారం మేళ్లచెర్వులోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటి ఆవరణలో పాడిపశువుల పెంపకం, పెరటికోళ్ల పెంపకం ఎలా లాభాసాటిగా నిర్వహించుకోవాలనే అంశాలపై సమాఖ్య సభ్యులకు ఆమె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేళ్లచెర్వు, చింతలపాలెం మండలాల మహిళా రైతులు, శ్రీనిధి అసిస్టెంట్ మేనే జర్ మల్లిక, సభ్యులు, సక్కుబాయి, జ్యోతి, నీలిమ, ఏపీఎం, ఆర్.శ్రీని వాస్ తదితరులు పాల్గొన్నారు

పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలి

సూర్యాపేటటౌన్, ఆగస్టు 22: అర్హులైన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, ఇళ్లు అందజేసి ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. గురువారం ఖమ్మంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యతో కలిసి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని కుడకుడ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెం. 126లో నిరుపేదలు ఆరేళ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలి పారు. కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు గంతలో పేదల గుడిసెలు తొలగించాలని భౌతిక దాడులకు యత్నించారన్నారు. ఎన్నికల సమ యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు అందజేయాలని కోరారు. మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించి అర్హులైన పేదలకు పట్టాలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు, ఆవుల అశోక్, కొత్తపల్లి రేణుక, కారింగుల వెంకన్న, గొడ్డలి నర్సయ్య, ఎర్ర అఖిల్‌కుమార్, హుస్సేన్, మోహన్, కరుణాకర్, పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మాస్‌లైన్ నాయకులు

వాస్తవాలను ప్రతిబింబించే రఘువీర్ రచనలు



మనోసంద్రాన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పుప్పాల కృష్ణమూర్తి

కోదాడ టౌన్, ఆగస్టు 22: ప్రముఖ కవి ఎన్వీ రఘువీర్‌ప్రతాప్ రచ నలు వాస్తవాలను ప్రతిబించిస్తాయని సిరివేరు సాహితీ సేవా కళా పీఠం అధ్యక్షుడు పుప్పాల కృష్ణమూర్తి అన్నారు. ఎన్వీ రఘువీర్ ప్రతాప్ రచించిన 'మనోసంద్రాన' అనే కవితా పుస్తకాన్ని గురువారం పబ్లిక్‌క్లబ్ ఆడిటోరియంలోని బుక్ ఎగ్జిబిషన్లో కృష్ణమూర్తి ఆవిష్కరించి మాట్లాడారు. ఆవిష్కరించారు. మణిపూసలు, మనోసంద్రాన పుస్తకాన్ని రఘువీర్ చక్కగా రాశారని, ఆయనకు తెలుగులో ఎన్నో ప్రక్రియలలో కవితలు, ఎన్నో గజల్స్ రాసిన అనుభవం ఉందన్నారు. ఇటీవల రఘువీర్‌కు కీర్తి పురస్కారాన్ని తెలుగు విశ్వవిద్యాలయం అందజేసిందన్నారు ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, ఎస్ రాజు, ఎస్ఎస్ రావు, తుమ్మ రాజా, జానకిరామ్, లింగమూర్తి, నాగార్జున పాల్గొన్నారు.

అనాజీపురం గ్రామ సమస్యలపై అవగాహన

పెన్‌పహాడ్, ఆగస్టు 22: కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన లయోలా అకాడమికి చెందిన వ్యవసాయ కోర్సు విద్యార్థులు మండలంలోని అనాజీపురంలో గురు వారం పర్యటించారు. గ్రామ రైతు వేదికలో భాగస్వామ్య గ్రామీణ అంచనా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పటం ద్వారా గ్రామా ల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, పంటల వివరాలు, వ్యవసాయ భూముల రకాలు, రకాలను, గ్రామంలోని స్త్రీలు, పురుషుల వివరా లలు, ఎలు సమస్యలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. వరి పైర్లను పరిశీలించి ఆకుముడత తెగులును గుర్తించారు. సస్య రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు లిఖిత, శ్రీజ, శ్రావణి, అఖిల, హరిణి, హర్షిత, ఎ.నరేష్, మురళి, రైతులు పాల్గొన్నారు.



అనాజీపురం గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న లయోలా కళాశాల విద్యార్థులు

సంక్షిప్త సమాచారం



భానుపురి: తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తు న్నందున శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు సూర్యాపేట టౌన్-1 అసిస్టెంట్ ఇంజనీర్ ఆర్. సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెన్‌పహాడ్: మండలంలో టీఎస్‌టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదుకు అపూర్వ స్పందన వస్తోందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలో ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సత్యనారాయణ, బండ్ల రమేష్‌తో కలిసి మండలంలోని భక్తాళాపురం, నూర్జహాన్‌పేట, చీదెళ్ల, గాజుల మొల్కాపురం, లింగాల గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో రామ్‌జీ, రామారావు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య అన్నారు. గురువారం మండలంలోని గోపాలపురంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లారు. కార్యక్రమంలో రంగయ్య, వెంకటే శ్వర్లు, సైదయ్య, పెద్దవెంకటేశ్వరరావు, చినవెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మునిసిపల్ కమిషనర్ యాకూబ్‌పాషా కోరారు. దోమల నివారణకు పట్టణంలోని పలు వీధుల్లో ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పట్టణంలో జ్వరాలపై సర్వే చేయిస్తున్నట్లు తెలిపారు.. ఈ కార్యక్ర మంలో శేఖర్‌రెడ్డి, సీతారాములు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● ప్రైవేట్ టీచర్లను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొట్టె నాగరాజు కోరారు. పట్టణంలో నిర్వ హించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావే శంలో ఆంజనేయులు, విజయ్‌కుమార్, వెంకటరెడ్డి, చారి, నవీన్, ప్రకాష్, నాగరాజు, ఆనంద్ పాల్గొన్నారు.

●హుజూర్‌నగర్ పట్టణంలోని గాంధీపార్క్ సెంటరులో ఈ నెల 23వ నుంచి 25వ తేదీ వరకు జానపద కళోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు దొంతగాని సత్యనారాయణ తెలిపారు. పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని గాంధీ పార్క్ నుంచి సాయి బాబా థియేటర్ వరకు కళాకారుల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగాఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, రాష్ట్ర కళాకా రులు సాయిలక్ష్మి, వంగా శ్రీనివాస్‌గౌడ్ హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో గోవింద్, సుకన్య, భద్రాచలం, నానాజీ పాల్గొన్నారు.

మఠంపల్లి: సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ సేవా భావంతో ఉండాని ప్రముఖ రంగ స్థల కళాకారుడు గుంటి పిచ్చయ్య అన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా గురువారం కోదాడలోని శనగల రాధాకృష్ణ మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో పిల్లలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేసి ఆయన మాట్లాడారు.

గరిడేపల్లి: మండలంలోని రాయినిగూడెం పాఠశాలలో విద్యార్థులకు శాంతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఐఆర్‌ఎస్ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ చందా సుధాకర్‌రెడ్డి క్రీడా దుస్తులను పంపిణీ చేశారు.

మద్దిరాల: తమ భూమిని పట్టా చేయాలని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కుందూరు విష్ణువర్దన్‌రెడ్డి, కుందూరు శ్రీనివా సరెడ్డి కోరారు. మండలంలోని కుంటపల్లి గ్రామంలో వారు మాట్లాడారు. సర్వే నెం.34లో 25గుంటల భూమిని రావుల వీరారెడ్డి నుంచి తమ తండ్రి అమృతారెడ్డి 45ఏళ్ల క్రితం కొనుగోలు చేశారని తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ అమీన్‌సింగ్‌ను వివరణ కోరగా పక్క రైతుల వాంగూల్మం తీసుకుని రైతులకు న్యాయం చేస్తామన్నారు.

నాగారం: మండలంలోని డి.కొత్తపల్లి గ్రామంలో వివిధ పార్టీలకు రాజీ నామా చేసి సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీలో ఆ పార్టీ జిల్లా కార్య దర్శి మండారి డేవిడ్‌కుమార్ సమక్షంలో గురువారం చేరారు. పార్టీలో చేరిన వారిలో పడిశాల సోమలింగం, దోమలపల్లి గోవర్ధన్, కొండ నాగ రాజు, రాయల రాజ్‌కుమార్, అక్కినేపల్లి నాగారాజు, అనంతోజు సత్తయ్య, కాతా మహేష్, వేల్పుల మధు, సయ్యద్ జమాల్ ఉన్నారు. అనంతరం సీపీఐ (ఎంఎల్)గ్రామ కార్యదర్శిగా దండోలు ధనుంజయను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, శంకర్, కాశయ్య, పి.కిరణ్ పాల్గొన్నారు.

నాగారం: నాగారం బంగ్లా పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపీ డీవో ధార శ్రీనివాస్ మొక్కలు నాటారు. అనంతరం ఈటూరు గ్రామం లోని సంపద వనాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపివో కె.మారయ్య, ఏపీవో రవి, ఈసి ముక్కంటి, కార్యదర్శులు శోభన్‌బాబు, సతీష్, టిఏలు రాంనరేష్, సురేష్, ఎఫ్ఏలు కె. వెంకన్న, కళమ్మ, పూలమ్మ అంజయ్య, రవీందర్ పాల్గొన్నారు.